క్లుప్తంగా

సమాజంపై సేవా భావం కలిగి ఉండాలి



ఎన్ఎస్ఎస్ శిబిరంలో పనిచేస్తున్న విద్యార్థులు

దెందులూరు: విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరూ సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు అన్నారు. శుక్రవారం వ్యాయామ కళాశాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.రత్నబాబు ఆధ్వర్యంలో అధ్యాపకుడు దిలీప్ కుమార్ పర్యవేక్షణలో బీపీఈడీ, డీపీఈడీ అధ్యాపక విద్యార్థులు శ్రమదానం చేశారు.

412 పశువులకు టీకాలు

దెందులూరు: పశు వైద్యశాఖ పశువుల ఆరోగ్య పరిరక్షణకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య శాఖ నాగులదేవునిపాడు జేవీవో రాములయ్య దొర అన్నారు. శుక్రవారం నాగులదేవునిపాడు పశు వైద్యశాల పరిధిలో 412 ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. యజమానులకు ఈ వ్యాధికి సంబంధించి లక్షణాలు నష్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు.

లక్ష్యాలు సాధించాలి

దెందులూరు: వైద్యశాఖ లక్ష్యాల సాధనకు సిబ్బందిలో భాగమైన ఆశా కార్యకర్తలు అంకిత భావంతో విధులు నిర్వహించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య అన్నారు. శుక్రవారం పోతునూరు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ ప్రభాకర్ రావు, హెల్త్ సూపర్‌వైజర్ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

దెందులూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గోపన్నపాలెం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు 22 నుంచి జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు కొండేటి రామకృష్ణ, హనుమంతు తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభిస్తారని మాజీ సర్పంచ్, కమిటీ సభ్యులు తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

భీమడోలు: సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించి తన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దస్తావేజుల లేఖర్ల సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి నందూరి శ్రీరామ్, భీమడోలు దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు వెజ్జు నాగేశ్వరరావు, కార్యదర్శి వర్ధనీడి బాలమురళీకృష్ణ, కోశాధికారి శీమకుర్తి రాము పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పోషణ్ అభియాన్

పెదపాడు: ఉప్పు అధికంగా వాడటం ద్వారా ఆరోగ్యానికి పెనుముప్పు తెస్తుందని డీఎంఅండ్‌హెచ్ఓ అమృత తెలిపారు. మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్ఓ అమృత మాట్లాడుతూ విద్యార్థులకు లోపపోషణ లేకుండా చూడలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సత్యనారాయణ, ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా

ఉంగుటూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేబ్రోలు గీతాంజలి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 147 మంది హాజరు కాగా, 102 మందిని పలు కొలువులకు ఎంపిక చేసినట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. జాబ్ మేళాలో 11 కంపెనీల ప్రతినిధులు, స్కూల్ చైర్మన్ ఎం.సుబ్రమణ్యం, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ అంబేడ్కర్ చెప్పారు. పెదపాడు సెక్షన్ పరిధిలోని ఆర్‌వీ పాలెం ఫీడర్, పాతముప్పర్రు సబ్‌స్టేషన్ పరిధిలోని వీరమ్మకుంట ఇండస్ట్రియల్ ఫీడర్, ఏపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతులు చేపట్టనున్నారు.

స్వామినాథన్ కమిషన్ సూచనలు అమలు చేయాలి

ఉంగుటూరు: స్వామినాథన్ కమిషన్ సూచనలు అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు కావాలని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకరం తూర్పు వీధి ఎల్ఐసీ కల్యాణ మండపంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉంగుటూరు మండల రైతుల మహా సభ నిర్వహించారు. ఏపీ కౌలు రైతు సంఘం కన్వీనర్ కోర్ని అప్పారావు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. ఇరుకు బడి

- ఇరుకు గదుల్లో మగ్గుతున్న బాల్యం
- వసతుల లేమితో అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ఏడాదిగా ఒక్క పైసా విదల్చని ప్రభుత్వం



అరుంధతీ కాలనీలో ఇరుకైన గదిలో నిర్వహిస్తున్న భీమడోలు నంబర్-3 కేంద్రం

భీమడోలు: ఇరుకైన గదులు, చాలీచాలని వసతులతో అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో అటు సిబ్బంది, ఇటు చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇరుకైన గదుల్లో కేంద్రాల నిర్వహణతో చిన్నారులకు విద్యా బోధనతో పాటు స్వేచ్ఛగా ఆడుకునేందుకు అవకాశం లేక నానా అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఫ్రీ స్కూలు విద్యకు దూరమవుతూ వారు ప్రైవేటు బాట పడుతున్నారు. కూటమి పాలకులు, అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఏడాది కాలంలో చిల్లి గవ్వ కేటాయించకపోవడంతో కేంద్రాల నిర్మాణాలు అటకెక్కాయి.

అంగన్‌వాడీ నిర్మాణాలకు నిధుల లేమి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేయగా, అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఆ నిధులను నిలిపి వేసి, నిర్మాణాలకు గ్రహణం పట్టించింది. దీంతో పలు దశల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అదే విధంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 260 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తుండగా, వాటిలో 143 కేంద్రాలకు శాశ్వత భవనాలున్నాయి. అద్దె భవనాల్లో 57, ఉచితంలో 60 భవనాలు నడుస్తున్నాయి. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 5367 మంది, 3 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 2227, గర్భిణులు 986, బాలింతలు 845 మందికి సేవలందిస్తుంది. భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నిడమర్రు మండలంలో 3, ఉంగుటూరు మండలంలో 2, భీమడోలు మండలంలో 5 ఏరియాల్లో అంగన్‌వాడీ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

అరకొర వసతులతో చిన్నారుల ఇబ్బందులు

అద్దె భవనాల్లో గదుల్లో చిన్నారులు అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. పక్కా భవనాలున్న కేంద్రాల్లోని చిన్నారులకు బెంచీలు, స్మార్ట్ టీవీలను సమకూర్చగా, కిచెన్ గార్డెన్‌కు నిధులిచ్చారు. కానీ అద్దె భవనాల్లో కేంద్రాలకు చిన్నారులకు వాటి జాడ లేదు. దీంతో అక్కడ వివక్షత కనిపిస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి శాశ్వత భవనాలు నిర్మించి పిల్లలకు ఆడుకునే ప్రదేశాలు, శుభ్రమైన వాతావరణం కల్పిస్తేనే అంగన్‌వాడీ వ్యవస్థ సద్వినియోగమవుతుందని చిన్నారుల తల్లిదండ్రులు, లబ్ధిదారులు, స్థానికులు చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు పీవో ఎంఎస్ రాజశేఖర్ తెలిపారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	శాశ్వత భవనాలు	అద్దె భవనాలు	అద్దె ఉచితం
భీమడోలు	64	29	22	13
ఉంగుటూరు	85	60	10	15
నిడమర్రు	47	28	10	9
గణపవరం	64	26	15	23

నాడు-నేడు పథకంలో భవన నిర్మాణాలకు ప్రాధాన్యం



వైఎస్సార్ సీపీ హయాంలో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు ప్రాధాన్యత కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేశారు. అంగన్‌వాడీలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు విడుదల చేశారు. పలు చోట్ల మరుగుదొడ్లను నిర్మించారు. పక్కా భవనాలను నిర్మించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలన వచ్చి ఏడాది గడిచినా పలు దశల్లో ఉన్న కేంద్రాలను నిర్మించేందుకు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి భవనాలను నిర్మించాలి

– గంటా శ్రీనివాసరావు, ఎంపీటీసీ, పూళ్ల



అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం



పొదల మధ్యలో అంగన్‌వాడీ కేంద్రం



ఇరుకు గదిలో విశ్రాంతి తీసుకుంటున్న చిన్నారులు

నీటి పొదుపుపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: విద్యార్థులు నీటిని పొదుపు చేయడం అలవర్చుకోవాలని, నీటి వృథాతో భవిష్యత్‌లో ఎన్నో అనర్థాలు ఎదురవుతాయని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్, జోన్ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి అన్నారు. జెడ్పీపీ బాలికోన్నత పాఠశాలలో నీటి వనరుల సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నీటిబొట్టూ విలువైనదిగా భావించాలని, నీటి వృథాతో కరువు, కాటకాలు తప్పవని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నీటి సంరక్షణపై విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కిలారి రవి, హెచ్ఎం తోట సింహాద్రి అప్పారావు, పూర్వపు హెచ్ఎం బాల భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

భీమడోలు: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఆశా వర్కర్ల యూనియన్ నేతలు అన్నారు. ఏలూరు జిల్లా ఐదో ఆశా వర్కర్ల మహాసభ భీమడోలులోని కల్యాణ మండపం వద్ద ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కమల, కె.పోచమ్మలు తెలిపారు. భీమడోలులో వారు శుక్రవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ ఏర్పడి 20 సంవత్సరాలు గడిచిందని, ఎన్నో పోరాటాలతో పారితోషకం బదులుగా ఫిక్స్‌డ్ వేతనం రూ.10 వేలు సాధించుకున్నామన్నారు. జిల్లాలోని 27 మండలాలకు చెందిన 1800 మంది ఆశా వర్కర్లు హాజరవుతారన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సాగులో మెలకువలను వివరిస్తున్న ఏవో ఉషారాణి

భీమడోలు: వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తారని మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి అన్నారు. పూళ్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులతో ఆమె వరి క్షేత్రాలను సందర్శించారు. సార్వా సాగులోని మెలకువలను రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల ఆవశ్యకతను వివరించి, వారి అనుమానాలను నివృత్తి చేశారు. రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలను పాటించాలన్నారు. రైతులు ఈ-పంట నమోదు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు అధికంగా వాడొద్దు

పెదవేగి: రసాయన ఎరువుల అధిక వినియోగం వలన నేలలోని సూక్ష్మజీవులు నశించి నేల సారం తగ్గిపోతుందని డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఫణికుమార్ అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం పెదకడిమిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సేంద్రీయ సాగు ప్రాముఖ్యత, పంటల శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ అధ్యక్షుడు కోసరాజు బాల రామకృష్ణ చౌదరి, పీఏసీ అధ్యక్షుడు కోసరాజు వీర వెంకట వర ప్రసాద్, ఎ.రత్నమాల పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

గణపవరం: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని నినాదాలు చేశారు. చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వీఆర్ఏల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా తమ సమస్యలపై కనీస స్పందన లేకపోవడంతో ఆందోళన బాట పట్టామన్నారు. వీఆర్ఏల సంఘ నాయకులు తహసీల్దార్ అప్పారావుకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదు



ఉంగుటూరు: ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పుప్పాల వాసుబాబు, నేతలు



దెందులూరు: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ, నాయకులు

దెందులూరు: కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత సామూహిక నిరసనలు ప్రారంభమయ్యాయని పతనం తప్పదని జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి ఏలూరు మెడికల్ కాలేజీ వద్ద జరిగిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో పార్టీ అన్ని విభాగాల శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం మాట్లాడుతూ సమాజంలో పేద బడుగు బలహీన దళిత గిరిజన మైనారిటీ వర్గాల ప్రజలకు సకాలంలో ఉచితంగా వైద్యం అందించేందుకు మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేశారన్నారు. ఆ పథకాన్ని మరింత బలోపేతం చేసి దాదాపు 3 వేల వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి పేదలందరికీ ఉచిత వైద్యం అందేలా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం నేడు మెడికల్ కాలేజీలను రద్దు చేసి పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే పన్నాగం పన్నిందన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రద్దు చేయకపోతే వైఎస్సార్ సీపీ ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, నియోజకవర్గం పోలింగ్ బూతుల కన్వీనర్ తలారి రామకృష్ణ, సానిగూడెం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఫ్రాన్సిస్, నాయకులు మోహన్, రవి, బత్రాజు సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

వైఎస్సార్ సీపీ ఆందోళనలో ఉంగుటూరు నాయకులు

ఉంగుటూరు: ఏలూరులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఆందోళనలో ఉంగుటూరు నియోజకవర్గ నాయకులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పుప్పాల వాసుబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీప గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఎంపీటీసీ చాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పెనుగొండ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఏలూరు తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు

భీమడోలు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఏలూరులో శుక్రవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, యువకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రావిపాటి సత్య శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి కందులపాటి శ్రీనివాస్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శి మద్దుల రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మగుంట రంగా, అంబటి నాగేంద్ర ప్రసాద్, పాము మాన్‌సింగ్, రామిశెట్టి శ్రీను, గంటా శ్రీనివాసరావు, ఆళ్ల గోపి, పొల్నాటి శ్రీను, కోడూరుపాడు సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పచ్చా బాబి, నాయకులు పులఖండం మధు, చిన్నం వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణకే స్వస్థ్ నారీ సశక్తి



గణపవరం: మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



భీమడోలు: కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది



దెందులూరు: వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

గణపవరం: మహిళల ఆరోగ్య రక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈపథకాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్, పి.కిరణ్మయి అన్నారు. గణపవరం మండలం జల్లికొమ్మరలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు వైద్య సేవలు అందిస్తామన్నారు. మహిళల్లో రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు నిర్వహించి, వైద్యం అందిస్తారన్నారు. 220 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి కుర్రెల్ల వెంకటరత్నం, ఎంటీసీ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి కవల రాంబాబు, సీహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరం

భీమడోలు: ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని స్పెషలిస్ట్ వైద్యుడు రాజేంద్ర, గుండుగొలను పీహెచ్‌సీ వైద్యురాలు జాహ్నవిరెడ్డి అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ వద్ద శుక్రవారం స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీలు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు శరణ్య, మాజీ ఎంపీటీసీ చీమల చిన్నారావు, మాజీ ఉప సర్పంచ్ బర్ల రమణమూర్తి, పెద్దలు మద్దుల బ్రహ్మయ్య, బొల్లిన కోటేశ్వరరావు, రాళ్లపల్లి రామరాజు, సీహెచ్‌వో ఇందిర, ఉప ఆరోగ్య విస్తరణాధికారి మధుసూధన్, సూపర్‌వైజర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఉంగుటూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా క్యాంపులు

మహిళల ఆరోగ్యంతోనే సమాజ ఆరోగ్యం సాధ్యమని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ సునీత అన్నారు. భీమడోలులో శుక్రవారం ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు సీహెచ్‌సీలో వైద్యులచే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

క్యాన్సర్ వ్యాధుల గుర్తింపు

దెందులూరు: మహిళలు, బాలికలు వైద్య పరీక్షలు చేయించుకోవడంలో నిర్లక్ష్యం వహించకూడదని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు చైతన్య, శాంతకుమారి అన్నారు. శుక్రవారం దోసపాడులో సర్పంచ్ ఏసుమణి అధ్యక్షతన పోతునూరు పీహెచ్‌సీ స్వస్థనారి స్వశక్తి పరివార అభియాన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అన్ని రకాల క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఎంపీహెచ్ఓ ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ హరి, నాయకులు శ్రీను ఏసేబు రాము, గంగరాజు, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

రక్తదాతలు ప్రాణదాతలని కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుందర్‌బాబుతో పాటు కొందరు రక్తదానం చేశారు. అనంతరం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ పథకంలో భాగంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ తోట ఏసమ్మ సూపరింటెండెంట్‌తో పాటు రక్తదానం చేసిన దాతలను అభినందించారు.

మహిళ ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం

ఉంగుటూరు: ఇంట్లో మహిళ ఆరోగ్యవంతంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావణ రెడ్డి అన్నారు. శుక్రవారం గొల్లగూడెంలో పంచాయతీ సర్పంచి కరపా శ్రీనివాసరావు అధ్యక్షతన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం నాగమణి, వంజరపు దుర్గారావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శికి అభినందనలు



కారుమూరి సునీల్‌ను కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ

దెందులూరు: వైఎస్సార్ సీపీ నూతన యువజన విభాగ కమిటీలతో పాటు అన్ని కమిటీలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరు సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఇటీవల వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నేటూరి సాయి కృష్ణ యాదవ్ కారుమూరు సునీల్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వటానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, పదవి ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.